5247



# అహో గుణవతీ భార్యా!

మొగుడెన్ని విధాల యేడిపిస్తాడో యెలా కాల్చుకు తింటాడో సోది వెళ్లబోసింది నాగరత్నమ్మ.

''కాసేపు అత్తగారల్లే, కాసేపు ఆడపడుచల్లే కనిపిస్తారు రాజూ! ఒక్కోసారి సహనం నశించి సూయిసైడ్ కమిట్ చేద్దామా, శాస్త్రి చేతామా, పారిపోదామా, లేచిపోదామా అనే ఆలోచనలు తల్లో చేరి కందిరీగలులాగ కుట్టుతాయి. తమాయించుకోలేక, నన్ను నేను సంబాళించుకోలేక, హతమారుతుందనుకో రాజూ. కాలం యెంత ముందుకు నడిచినా మొగుళ్లు మారరేమో! యెంత మొగుడైతే మాత్రం అంత డామినేషనా? జాబ్‌లో చేరాక చేసుకుంటానంటే నాన్న విన్నాడు గాదు. ఫైనల్స్ వ్రాయక ముందే లగ్గం పెట్టించేశాడు. ఇంకేముందీ వేరే పని చేయవీలులేకుండా యాటా ఓ పిల్లకాయ. పోనీ సాయమూ లేదు. తానే మానేజ్ చేస్తానంటాడు నాధుడు. అదేమంటే పౌరుషమనిట. తానెన్నుకున్నదాన్నే కట్టుకున్నాడట. సాయం రమ్మంటే దెప్పుతారట. రెండు పూట్లా చేయలేక విసుక్కుంటే, ''పిల్లల్ని ఏమీ అనవద్దు. నే చేస్తా. పోయి పడుకో.'' అని అన్నంత పనీ చేస్తాడు. చూడలేక నేనే చేస్తూ వంటింట్లోకి రావద్దన్నా. ''యేం? నా వంట బాగాలేదూ? మా యింట్లో అందరికీ నేనే వండి వడ్డించా. నీకు చేసే అఫీసు కెళ్లగల్ను'' అన్నాడు. పోనీ కు.ని. పాటిద్దామన్నా. ''అదేమన్నమాట నాగమ్మ గారూ, కుంటీ, గుడ్డీ, పిచ్చి, ముష్టివారు కూడా చీకూ చింత లేకుండా కనిపారేస్తుంటే, కనుముక్కు తీరు గలిగి మంచి రంగుతో పుడుతుంటే, కు.ని. యెందుకూ?'' అని పిల్లకు బాబ్డ్ జుట్టు దువ్వసాగారు. ఒక్కోసారి పెద్దపెట్టున

యేడవాలనిపిస్తుంది. నే లేకపోయినా మగనికేమీ యిబ్బంది వుండదనుకో. నిన్ను విసిగిస్తున్నానేమో పోతా. దొడ్లో కాసిన రసాలు నాలుగన్నా యిద్దామని తెచ్చాను. నీకూ వంట వేళ'' అని లేచింది నాగరత్నమ్మ.

''కూచో నాగా. తెలికే లేదు నీకు. కబుర్లు వింటుంటే పని బరువు తెలియదు. వంట చేస్తూ వినవచ్చు. పోనీ నువ్వు వెన్నతీయి. నేను కూర తరుగుతా.'' పెగడ గిన్నె కవ్వం తెచ్చి, గిన్నెలో నీళ్లు పోసి యెదట పెట్టింది రాజామణి. నాగరత్నం చల్ల చిలుకుతున్నది కూచుని.

హాలులోంచి రాజామణి భర్త హడావుడిగా వచ్చాడు.

''రాజూ! ముష్టివాడరుస్తున్నాడు వినబడటం లేదూ? చిల్లర లేదు పొమ్మంటే, కాసిని మజ్జిగ పోయించమని విసిగిస్తున్నాడు. గ్లాసులో పోసి వాడికివ్వు.''

''నాగరత్నం చల్ల చేస్తున్నది. వెన్న పడగానే తీసి యిస్తా మజ్జిగ.'' పొయ్యి మీద కూరగిన్నె యెక్కించింది రాజామణి.

''వాడు నించో లేకుండా వున్నాడుట. పరగడుపట.'' అంటూ లాల్చీ గుండీలు రోల్డుగోల్డువి గిరగిరా తిప్పుకుంటూ వెళ్లి మళ్లా వచ్చాడు. ''పోనీ సాఫ్ట్ డ్రింక్ యిప్పించండి'' అన్నది.

వంగడు కొంపలంటుకున్నట్టు చూశాడు. చిటచిటలాడుతూ విసుక్కున్నాడు. ''వద్దుట. అదీ అడిగాను. గొంతు నెప్పిట, మజ్జిగే కావాలిట. నాకేం పని లేదా? ఆసులో తిరిగే కండెలాగా నీకూ వాడికీ మధ్య తిరగటమేనా?

పేపరందుకున్నాను. పార్టీ సభ్యులొచ్చారు. వాళ్ల గోడు వినాలి.'' కళ్లజోడు తీసి తుడిచి పెట్టుకున్నాడు. ధోవతీ కుచ్చిలు జీరాడుతున్నాయి.

రాజు గ్లాసుంచింది. నాగరత్నం వెన్న పక్కకినెట్టి చల్ల పోసింది.'' నువే యియ్యి. వాడు మరేదో అడుగుతాడు.'' అని కసిరాడు భర్త. '' అందరూ నన్ను అడించేవారే'' అని వీధి వాకిలివేపు వెళ్లాడు. ముష్టివాడు వాకిలి దాటుతుండగా వాకిట్లో బండీ ఆగింది. పార్టీ సభ్యురాలు దిగింది. పర్స్ తీసి చూసింది.

''చిల్లర లేదండీ, నూరు నోటున్నది. వాడికి బాడుగ యిస్తే వెళ్లిపోతాడు. మరో బాడుగ చూచుకుంటాడుట'' అని నిలబడింది.

''నీకిదేం అలవాటు, చంద్రమతీ? బండి దిగుతూనే చిల్లరకోసం గోల. చిల్లరుంచుకునే బండెక్కలేవూ? రాజూ గిన్నెలో చిల్లర పోసివుంచుతావుగా తెచ్చి యివ్వు. లేదా నీ మందిరంలో దేవుని గిన్నెలోది తెచ్చివ్వు. చిల్లర రెడీగా వుంచాలని చెప్పానా లేదా?'' అని అరిచాడు.

''వుంచానండి. మీరు వాడేసుకుని వుండాలి'' అన్నది రాజామణి.

''సమాధానం కాదు కావల్సింది. చిల్లర. పో తెచ్చియివ్వు'' అని కసిరాడు.

కూరలమ్మి యిచ్చిన చిల్లర కొంగున ముడేసి దోపుకున్నది రాజు. అది విప్పి యిచ్చింది. పార్టీ సభ్యురాలు బండివానిని పంపి యింట్లోకొచ్చి కూచున్నది. రాజు వంటింట్లోకొచ్చింది. ఇదంతా నాగమ్మ కంటబడుతూనే వున్నది. ఇంటికి వెళ్లబుద్ధిగాక వంట సాయం చేయసాగింది నాగరత్నం. ''వెళ్తా రాజూ. స్నానం చేయాలి'' అన్నది.

''వేడి నీళ్లున్నాయి. స్నానం కానీ ఇదుగో టవల్. నాది వాయిల్ చీర కొత్తదున్నది కట్టుకో. అల్మర్లో వున్నది యెదురుగా. భోజనాల వేళ వెళ్లగూడదు'' అన్నది రాజు.

పదకొండున్నర గంటలయింది. బల్లమీద అరిటాకులు పరిచి తుడిచి వడ్డిస్తున్నారిద్దరూ.

''రాజూ. నా మిత్రులిద్దరొచ్చారిప్పుడే. వారికీ వడ్డించాలి. నా మేనత్త తిరుపతి వెళ్తూ దోవలో దిగి నన్ను చూచి వెళ్లాలని వస్తున్నది మెయిల్లో. అపుడే వెళ్లిపోతుంది. అన్నవరంలో దిగాలిట. పులిహోరా, గారెలూ, మినప సున్నివుండలూ పొట్లాలు గట్టి సంచీలో వుంచు. అరటి పళ్లు ఆరు. మజ్జిగ సీసా ఒక గ్లాసు గూడా సద్దు'' ఒకటే హడావుడి చేశాడు భర్త.

భోజనాలైనై. వాకిట్లో బండి ఆగింది. మేనత్తను బండిలో యెక్కిస్తున్నాడు భర్త. మరొక బండి ఆగింది. అందునుండి మగని మేనగోడలు కూతురు దిగింది. ఆమె భర్త, యిద్దరు చిన్నపిల్లలు లోపలికొచ్చి హాలులో ఆసీనులైనారు.

రాజు, నాగమ్మ భోజనం కానిచ్చి బల్ల క్లీన్ చేస్తున్నారు. మగడు లోపలి కడుగుంచి గబగబా వల్లించాడు.

''రాజూ! నా మనమరాలు పెళ్లికెళ్తూ వచ్చింది. క్రిందటిసారి వచ్చినప్పుడు, నగలు మెషీన్ మీద చేసినవి, నాజూకైనవి చూపావుట. అవి యిస్తే పెట్టుకెళ్తుందిట. అవి మోడరన్ డిజైన్లుట. పెళ్లినించి వస్తూనే నీ నగలు నీకిచ్చేస్తుందిట'' జవాబుకోసం చూడకుండా హాలులోకెళ్లిపోయాడు భర్త.

''దోవలోనే జ్యూయెలరీ షాపు. కొనుక్కునే పెట్టుకుని వెళ్ళచ్చుగా ?''

''టైమ్ చాలదుట. లగ్గం వేళకి అక్కడుండాలిట. తెచ్చి యియ్యి'' అని హాలులోంచే అరిచాడు భర్త.

రాజు నగల పెట్టె మనమరాలు ముందుంచింది. మూత తీసినమ్మాయి ''గాజులే అడిగాను'' అన్నది గానీ, రమ అన్నీ తీసి అలంకరించుకున్నది. పెట్టె ముయ్యకుండా వదిలేసి మగడు పిల్లలతో వెళ్లిపోయింది.

రాజు నగల పెట్టె తీసికెళ్లి బెడ్ రూమ్‌లో డ్రెస్సింగ్ టేబిల్ ముందుంచుతున్నది. నాగరత్నం అద్దంలో చూసుకుంటున్నది.

''రాజూ! మా బావ వచ్చాడు. కోర్టులో డబ్బు దఖలు పరచాలిట. యెనిమిది వేలు కావాలంటున్నాడు. రవ్వల కమ్మలు మంచి అందమైనవి వచ్చాయి. కొనుక్కోవాలని డబ్బు డ్రా చేసి తెచ్చుకున్నావు గదూ. అదిచ్చేయి. ఆపదలో వున్నాడట. తప్పక పంట అమ్మి తీర్చేస్తాడుట. ఇల్లూ పొలమూ ఉన్నాయి. పారిపోడుగా, వేళైంది. ఇవాళే కట్టకపోతే వాయిదా పడి మళ్లా వస్తాడు బావ''.

రాజూ, నాగరత్నం ఒకరిమొహాలొకరు చూసుకున్నారు. రాజు రెండోసారి గోడ్రెజ్ బీరువా తాళం తిప్పింది. గుర్తుగా పెట్టుకున్న చిన్న పట్టు సంచీ, చిన్న అరలోంచి తీసింది. తాళం బిగించింది. తాళాలు టేబిల్ మీదుంచి హాలులోకెళ్లి, మగడూ వాని బావమరిదీ మధ్య బల్ల మీదుంచింది. ''లెక్కగానే వున్నది బొత్తి'' అని వచ్చేసింది బెడ్‌రూమ్‌లోకి. తల ముడేసుకుంటున్న నాగరత్నం అన్నది.

''వెళ్తా రాజూ! నీ ఓరిమి ముందు నా సహనం తీసికట్టు'' అని నవ్వింది.

''నవ్వెందుకొచ్చింది నాగా? సాయంకాలం వరకు వుండవా?'' అన్నది రాజామణి. నాగరత్నం కుర్చీలో కూచుని వూగుతూ అన్నది.

''కథ గుర్తు వచ్చి నవ్వు వచ్చింది. 'అహో గుణవతీ భార్యా భాంద మూల్యం నయాచతి'. కథ వినలేదూ? ఒకడు తన భార్యా గయ్యాళితనం వర్ణించి చెపితే మిత్రుడు ఓదార్చి తన యింటికి భోజనానికి తీసికెళ్లాడు. భోజనం పెడుతుండగానే భార్యకి కోపం వచ్చింది. భోజనం కుండ తెచ్చి మగని నెత్తిన కొట్టింది. అది పగిలింది. ''కొత్త కుండ. నాకు కోపం తెప్పించావు. కుండ పగలటానికి నువే కారణం. కుండ ధర యిచ్చేయి'' అన్నదిట మిత్రుని భార్య.

అదంతా చూసిన మిత్రుడు''అబ్బో యీ లెక్కన నా భార్యా చాలా బుద్ధిమంతురాలు. కుండ పగలకొట్టి దాని వెల యిమ్మని అడగలేదింతవరకు. కుండ పగలకొట్టి వెళ్లిపోయేది'' అని సంతోషించాడు. నా భర్త గారింకా నా డబ్బు గుంజే స్థితికి రాలేదని సంతోషించా.'' నాగరత్నం లేచి దొడ్డి వాకిలి వేపు వెళ్లింది. రాజామణి ఆమెను సాగనంపి తలుపు మూసివచ్చింది.